ఆసుపత్రిలో చేరిన మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ ఆసుపత్రిలో చేరారు. శ్వాసకోశ సమస్య తలెత్తడంతో ఆయనను కుటుంబ సభ్యులు మణిపాల్ ఆసుపత్రికి చేర్పించారు. ఇటీవల కొంతకాలంగా దేవేగౌడ వయోభారం ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల పార్లమెంటు సమావేశాలు, అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠలోనూ పాల్గొన్నారు. శ్వాస తీసుకోవడంలో సమస్య రావడంతో గురువారం ఉదయం మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం దేవెగౌడ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.



నామినేషన్లు దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు. చిత్రంలో సీఎం, డీసీఎం తదితరులు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి నారాయణసా భాండగె



జేడీఎస్ అభ్యర్థి కుపేంద్రరెడ్డి నామినేషన్‌లో పాల్గొన్న కుమారస్వామి తదితరులు



రాజ్యసభ ఎన్నికల్లో మలుపు

- నాలుగు స్థానాలకు ఐదుగురి నామినేషన్
- అనూహ్యంగా తెరపైకి వచ్చిన జేడీఎస్ అభ్యర్థి
- క్రాస్ ఓటింగ్ తథ్యమంటున్న పరిశీలకులు
- మాకు ఆత్మసాక్షి ఓట్లు ఖాయం : డీకే

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలకు జరగనున్న ఎన్నికల బరిలో గురువారం ఐదో అభ్యర్థి ప్రవేశించడంతో సమరం కొత్తమలుపు తిరిగింది. శాసనసభలో ఉన్న బలాబలాల ఆధారంగా కాంగ్రెస్ మూడు, బీజేపీ ఒక స్థానాన్ని సులభంగా గెలుపొందే అవకాశం మాత్రమే ఉంది. గెలిచేందుకు ఇంకా అరడజనుకు పైగా ఓట్ల అవసరం ఉన్నా బీజేపీ-జేడీఎస్ కలిసి రెండో అభ్యర్థిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త, మాజీ ఎంపీ కుపేంద్రరెడ్డిని రంగంలోకి దించాయి. ఎన్డీయే అభ్యర్థిగా తాను బరిలో ఉన్నానని కుపేంద్రరెడ్డి వెల్లడించారు. నాలుగు రాజ్యసభ స్థానాలకు ఏకగ్రీవ ఎన్నిక ఖాయమని భావిస్తున్న తరుణంలో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో మరి ఆత్మసాక్షి ఓట్లు ఎవరి కొంప ముంచుతాయోనని సర్వత్రా ఉత్కంఠత నెలకొని ఉంది. ఐదో అభ్యర్థి రంగంలోకి దిగడంతో బేరసారాలకు తెరలేచిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మూడు స్థానాల గెలుపుపై అధికార కాంగ్రెస్ ధీమాగా ఉంటే, తమ ఇద్దరు అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని ప్రతిపక్షాలు ఆశాభావంతో ఉన్నాయి.

నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులు

రాష్ట్రం నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు అజయ్‌మాకెన్, నాసిర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్‌కు కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విధానసౌధలో గురువారం బి-ఫారాలు అందజేశారు. అనంతరం ముగ్గురు అభ్యర్థులతో ఆయన కొద్దిసేపు సమావేశమయ్యారు. ఆపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెంటరాగా కాంగ్రెస్ అభ్యర్థులు రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు కూడా హాజరయ్యారు. కాగా ప్రతిపక్షాలు రెండో అభ్యర్థిగా కుపేంద్రరెడ్డిని రంగంలోకి దించడంతో కాంగ్రెస్ ఓట్లుక్రాస్ కాకుండా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై సీఎం, డీసీఎం చర్చించారు. ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులూ తొలి రౌండులోనే సునాయాసంగా గెలుపొందడం ఖాయమని అనంతరం డీకే శివకుమార్ మీడియాకు చెప్పారు. వీరి గెలుపు కోసం పక్కా వ్యూహంతోనే ముందుకు సాగుతామన్నారు. తమకూ అన్ని పార్టీల్లోనూ స్నేహితులున్నారని, ఆత్మసాక్షి ఓట్లు తథ్యమని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. జేడీఎస్ అభ్యర్థి కుపేంద్రరెడ్డికి అన్ని పార్టీల్లోనూ స్నేహితులున్నారని, ఆత్మసాక్షి ఓట్లు లభించే అవకాశం ఉందని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై ఆయన పై విధంగా స్పందించారు. బీజేపీ, జేడీఎస్ హార్స్‌ట్రేడింగ్‌లో సిద్ధహస్తులని, బీజేపీ ఓట్లు ఏ మేరకు జేడీఎస్‌కు లభిస్తాయో ఈ నెల 27 వరకు వేచిచూడండి అని ఆయన మీడియాకు చెప్పారు. ఈ ఎన్నికల్లో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉందని, తమ ఇద్దరు అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర చేసిన ప్రకటనపై స్పందిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. బీజేపీకి చెందిన ఇద్దరు లేదా ముగ్గురు ఎమ్మెల్యేలు, జేడీఎస్‌కు చెందిన ఇద్దరు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటేసే అవకాశం ఉందని కాంగ్రెస్ శిబిరంలో జోరుగా చర్చ జరుగుతోంది.

బీజేపీ, జేడీఎస్ తరపున ఇద్దరు నామినేషన్ దాఖలు

రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ, జేడీఎస్ (ఎన్‌డీఏ) కూటమి అభ్యర్థులుగా ఇద్దరు నామినేషన్ వేశారు. రాష్ట్ర శాసనసభ నుంచి రాజ్యసభ సభ్యులను ఎంపిక చేసే ఎన్నికలలో భాగంగా కూటమి ఇద్దరు అభ్యర్థులను రంగంలోకి దింపడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. బీజేపీ అధిష్ఠానం నారాయణసా భాండగెను అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్ష నేత అశోక్ సహా పలువురితో కలిసి గురువారం నామినేషన్ వేశారు. కాంగ్రెస్‌కు ఉండే శాసనసభ్యుల మెజారిటీతో ముగ్గురిని సులభంగా గెలుచుకోవచ్చు. అదే తరహాలోనే బీజేపీ ఒక స్థానాన్ని సునాయాసంగా కైవసం చేసుకోవచ్చు. ఎన్‌డీఏ కూటమి తరపున మాజీ ఎంపీ, జేడీఎస్ నేత కుపేంద్రరెడ్డి నామినేషన్ వేశారు. జేడీఎస్‌నేత కుమారస్వామి సహా పలువురు పాల్గొన్నారు. ఆయన నామినేషన్‌తో కాంగ్రెస్ మిగులు ఓట్లతో పాటు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేల మద్దతు కీలకమవుతోంది. దీంతో కాంగ్రెస్ వారిని కట్టడి చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం శాసనసభలో 19 మంది మాత్రమే జేడీఎస్ సభ్యులు ఉన్నారు. ఇక బీజేపీలో 65 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు ఇందుకు కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా వ్యవహరించి ముందుగానే ఎవరెవరు ఎవరికి ఓట్లు వేయాలనేది ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.

బాండ్ల ద్వారా రూ.2వేల కోట్లు

- సమకూర్చుకున్న కెనరాబ్యాంకు

केनरा बैंक Canara Bank

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద జాతీయ బ్యాం కుగా ఉన్న కెనరాబ్యాంకు బేసెల్ 3 కాంప్లియెంట్ అదనపు టయర్ 1 బాం డ్ల రెండో సిరీస్ ద్వారా రూ.2వేల కోట్లను సమకూర్చుకుంది. ఈ మేరకు బ్యాంకు నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ బాండ్లపై కూపన్ రేట్‌గా ఏడాదికి రూ. 8.40 శాతం వడ్డీ చెల్లించనున్నారు. రూ.2వేల కోట్ల బాండ్లను ఆహ్వానించగా మొత్తం రూ. 2,432 కోట్ల మేరకు బిడ్స్ వచ్చాయని ప్రకటనలో వెల్లడించింది.

సర్వజీవావరణం ఆరోగ్యంగా ఉండాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం అంటే సర్వ జీవావరణ ఆరోగ్యమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మానవాళి, పశుపక్ష్యాదులు, పర్యావరణ సంరక్షణ ఇవన్నీ పరస్పర ఆధారితాలని పేర్కొన్నారు. బెంగళూరులో గురువారం వరల్డ్ వెటర్నరీ పౌల్ట్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆరోగ్యం అంటే ఏ ఒక్కరి ఆరోగ్యమో కాదని, వీటన్నింటినీ కలిపి చూసే దృష్టికోణాన్ని మనం అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఒకటే భూమి ఒకటే ఆరోగ్యం అంటూ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా సర్వ జీవావరణ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు తగిన విధంగా సమగ్ర వ్యూహాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పౌష్టికాహార భద్రతను కల్పించాల్సిన అవసరం చాలా ఉందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఈ సవాల్‌ను భారత పౌల్ట్రీ రంగం స్వీకరించాలని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి ప్రోటీన్ సంపన్నమైన ఆహారం అందించడంలో కోళ్ల పరిశ్రమ భాగస్వామ్యం చాలా ముఖ్యమైనదన్నారు. ఈ పరిశ్రమ వృద్ధిలో వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, అనుబంధ రంగాల వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గుడ్ల ఉత్పత్తిలో భారత దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. 2022లో ఈ వాణిజ్యం విలువ రూ1.40 లక్షల కోట్లుగా ఉందని, ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కోడిగుడ్ల ఉత్పత్తిలో 57 శాతం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్, హర్యానా రాష్ట్రాల నుంచే వస్తోందన్నారు. ఇటువంటి సదస్సులు కోళ్ల పరిశ్రమ రంగం వృద్ధికి తద్వారా పోషకాహార సమృద్ధికి దోహదం చేస్తాయన్నారు. ఈ సదస్సును ఏర్పాటు చేసిన వరల్డ్ వెటర్నరీ పౌల్ట్రీ అసోసియేషన్ (భారత్), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ న్యూట్రిషన్ అండ్ ఫిజియాలజీని వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా అభినందించారు. దేశ విదేశాల నుంచి పౌల్ట్రీ రంగానికి చెందిన నిపుణులు ఈ సదస్సుకు హాజరయ్యారు.



స్మరణ సంచికను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ప్రముఖులు

'నీ చూపు చెప్పింది నాకు' పుస్తకావిష్కరణ

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన రచయిత కొరటమద్ది హేమంత్ తొలి నవల 'నీ చూపు చెప్పింది నాకు' చాలా బాగుందని, తొలి ప్రయత్నంలోనే ఆకట్టుకునేలా ఉందని ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి పేర్కొన్నారు. హైదరాబాదులోని మాదాపూర్‌లో గల ఫీనిక్స్ అరీనాలో జరిగిన ఈ నవల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒకప్పుడు నవలలు సమాజంపై చక్కటి ప్రభావం చూపేవని, మళ్లీ అలాంటి పరిస్థితి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా దర్శకులు వీఎన్ ఆదిత్య, రచయిత, నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్, నటుడు, నిర్మాత వంశీ చాగంటి పాల్గొన్నారు. రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి సోదరుడు చెంబోలు శ్రీరామశాస్త్రి సభాధ్యక్షుడిగానూ, ఆర్‌జే శేఖర్ బాష వ్యాఖ్యాతగానూ వ్యవహరించారు. సభలో పాల్గొన్న వక్తలంతా నవలా రచయితను ప్రశంసించారు. తొలి ప్రయత్నంలోనే ఏక బిగిన చదివించే కథనంతో మానసిక తత్వ విశ్లేషణాత్మకంగా సాగిందంటూ అభినందించారు. నవలా రచయిత కొరటమద్ది హేమంత్ ధన్యవాదాలు తెలియజేస్తూ పుస్తక రచనకి తొలి నుంచి సహకారమందించి ప్రోత్సహించిన తనికెళ్ల భరణి, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

అందరి చూపు సిద్దూ బడ్జెట్ పైనే

- గ్యారెంటీలకు కేటాయింపుల పెంపు అనివార్యం
- అభివృద్ధికి నిధులు ఏమాత్రమో..?
- రికార్డు స్థాయిలో నేడు 15వసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మరో నెలన్నరలోనే ముంచుకొస్తున్న లోక్‌సభ ఎన్నికలు ఒక వైపు.. రాష్ట్రంలో తీవ్రమైన కరువు.. కేంద్రం నుంచి అందని చేయూత మరోవైపు.. ఈ నేపథ్యంలోనే ఆర్థికమంత్రి హోదాలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సీఎం సిద్దరామయ్య శాసనసభలో శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర చరిత్రలో సిద్దరామయ్య ఓ సరికొత్త రికార్డు నమోదు చేయనున్నారు. ఇప్పటి దాకా 14 బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన సిద్దరామయ్య 15వ బడ్జెట్ తీసుకురావడం ద్వారా మరో చరిత్రగా నిలవనున్నారు. గతంలో ఆర్థికమంత్రిగా రామకృష్ణహెగ్డే 13సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా సిద్దరామయ్య గత ఏడాది కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంలోనే అధిగమించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఆశించినంత మేర అన్ని విభాగాలలోను పన్నుల లక్ష్యం సాధ్యం కాకపోవడం, దీనికి తోడు దశాబ్దాల కాలం తర్వాత భయంకరమైన కరువు నెలకొనడం ప్రధానంగా సమస్యలుగా ఉన్నాయి. 2019 నుంచి వరుసగా నాలుగేళ్ల పాటు సంతృప్తికరంగా వర్షాలు కురవడంతో పంటల సాగు ద్వారా రైతులు లాభాల బాటలో గడిపారు. గత ఏడాది ఖరీఫ్ పంటకాలం నుంచే వర్షాలు పూర్తిగా దెబ్బతీశాయి. ఇలా ఖరీఫ్, రబీ పంటకాలల్లో దాదాపు సాగుకు అనుకూలం కాలేదు. బోరుబావుల కింద సాగుకు విద్యుత్ కోతలు వెంటాడాయి. ఇలా పంటల దిగుబడితో పాటు అనుబంధంగా వచ్చే ఆదాయం లేకుండా పోయింది. 13 తాలూకాలు మినహా రాష్ట్రమంతటా కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. అందుకు అనుగుణంగానే వివిధ జిల్లాలలో తాగునీరు, పశుగ్రాసం సమస్యగా మారింది. కరువు ప్రభావంతో ఆదాయానికి గండి ఏర్పడగా అత్యవసరాలకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

గ్యారెంటీలకు కేటాయింపులు పెంపు అనివార్యం

గత ఏడాది మేనెలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. తర్వాత ఒక్కొక్కటిగా ఎన్నికల వేళ ఇచ్చిన గ్యారెంటీలను శ్రీకారం చుడుతూ వచ్చారు. జూన్ 11న తొలి గ్యారెంటీగా శక్తిగ్యారెంటీ పేరుతో మహిళలు ఉచిత బస్సు ప్రయాణాలను ప్రారంభించారు. బడ్జెట్‌లో కేటాయించిన గ్రాంట్ కేవలం ఆరునెలలకే ముగిసింది. తర్వాత అదనంగా కేటాయింపులు చేస్తున్నారు. ఇంకా ఆర్టీసీ సంస్థలకు వేలకోట్లు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఇక గృహజ్యోతి గ్యారెంటీ ఉచిత విద్యుత్ అందించడం ద్వారా విద్యుత్ రంగ సంస్థలు లోటులోనే ఉన్నాయి. ప్రకృతిలో విద్యుత్ ఉత్పత్తి తగ్గడం ద్వారా కోతలు పెరిగాయి. ఇక కొనుగోళ్లు అనివార్యమవుతున్నాయి. గృహలక్ష్మి గ్యారెంటీ ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇంకా అర్జీలు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం పంపిణీ కంటే పూర్తిగా అందరికీ అమలు చేస్తే ఎక్కువ కేటాయింపులు అనివార్యం కానున్నాయి. అన్నభాగ్య ద్వారా బీపీఎల్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం లభించక నగదు బదిలీ చేస్తున్నారు. దీనికి తోడు రెండు లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఏప్రిల్ నుంచి కొత్తకార్డులు ఇవ్వదలచారు. ప్రస్తుతం ఉండే కార్డులకు అదనంగా మరో రెండు నుంచి మూడులక్షల కార్డులు పెరిగితే గ్రాంట్ పెంచడం అనివార్యం కానుంది. ఇక యువనిధి ఇటీవలే పథకం ప్రారంభించినా ఆశించినంతమంది దరఖాస్తు చేసుకోలేదని తెలుస్తోంది. ఇలా ఐదు గ్యారెంటీలకు గత ఏడాది కేటాయింపుల కంటే అదనంగా పెంచుకోక తప్పదని సంబంధిత విభాగాలు తేల్చి చెబుతున్నాయి.



బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దుతున్న సీఎం సిద్దరామయ్య

అభివృద్ధికి నిధులు ఏమాత్రమో..?

సిద్దరామయ్య సారథ్యంలోని ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తవుతోంది. బహిరంగంగా నిధులకు కొరత లేదని చెబుతున్నా గ్రాంట్ల కేటాయింపులు అంత స్థాయిలో జరగడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. తొలి ఏడాది ఎమ్మెల్యేల గ్రాంట్ల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉంది. ఇప్పటికే కేబినెట్‌లో 35 మంది ఎమ్మెల్యేలు ఉండగా 34 మందికి బోర్డులు కార్పొరేషన్ల ద్వారా సంతృప్తి పరచారు. కానీ అన్ని విభాగాలకు గ్రాంట్లు లేవనే విషయం వెంటాడుతోంది. కేంద్రం నుంచి ఆశించినంత మేర సహకారం అందడం లేదు. ప్రారంభంలో ఆర్థిక సర్దుబాట్లు జరిగినా ప్రస్తుతం అప్పులు అనివార్యంగా మారాయి. జీఎస్టీ వాటా పన్నులతో పాటు కరువు సాయం కూడా సమగ్రంగా రాకపోవడంతో రాష్ట్ర ఖజానాకు భారీ భారం పడుతోంది. ఇలా అన్ని విధాల ముప్పేట దాడి అనేలా సాగుతున్నాయి. రాష్ట్రంలో ప్రధానమైన భారీ జలవనరుల విభాగానికి కేటాయింపులు ఎలా ఉంటాయనేది కీలకమవుతోంది.


బడ్జెట్ మొత్తం పెరిగేనా..?



బడ్జెట్ గాత్రం మరోసారి పెరిగేనా అనేది ఉత్కంఠ రేపుతోంది. ఏటా బడ్జెట్ మొత్తాన్ని పెంచుతున్నా ఆ స్థాయిలో కేటాయింపులు లేవనేది తెలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సీఎం సిద్దరామయ్య రూ.3,27,747 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం అంతకు మించి ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. గత ఏడాది బడ్జెట్‌లో రెవిన్యూ చెల్లింపుల కింద రూ.2,50,933 కోట్లు, క్యాపిటల్ చెల్లింపులు రూ.54,374 కోట్లు, రుణాల చెల్లింపులు రూ.22441 కోట్లుగా ఉంది.

రెండునెలలుగా సీఎం కసరత్తు

బడ్జెట్ రూపకల్పన విషయమై ముఖ్యమంత్రి సిద్దరామయ్య సుమారు రెండునెలలుగా కసరత్తు చేస్తున్నారు. డిసెంబరు నుంచే శాఖల వారిగా సమీక్షలు నిర్వహించారు. జనవరిలో రోజుకు నాలుగైదు శాఖలపై సమీక్ష సాగించారు. తాజాగా రైతులు, కార్మికులతో పాటు విభిన్న వర్గాలతో సమీక్షలు జరిపి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతుసంఘాలు, దళిత సంఘాలు సహా పలువురితో ప్రత్యేక సమావేశాలు జరిపారు. చివరగా గురువారం శాసనసభ సమావేశాలు పాల్గొంటూనే బడ్జెట్ తుది మెరుగులు దిద్దారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.89	1,611.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	142	8,146
సామర్థ్యం (టీఎంసీలు)	9.36	40.01

రేపు బసవన్న చిత్రపటం ఆవిష్కరణ



బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15: ఈ నెల 17న జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సాంస్కృతిక సారథి జగజ్యోతి బసవన్న చిత్రపటం అవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశించారు. 12వ శతాబ్దపు విప్లవకారుడు శ్రీ జగజ్యోతి బసవన్న కులరహిత వర్గరహిత సమాజంకోసం కృషిచేశారన్నారు. సమాజంలో అసమానతలు, మూఢనమ్మకాలపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆయన ఆలోచనలు మన దేశ రాజ్యాంగం ఆకాంక్షలకు స్థిరమైన ఆధారాన్ని అందించాయని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగజ్యోతి బసవన్నను కర్ణాటక సాంస్కృతిక నాయకుడుగా ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశం ప్రకారం ఫిబ్రవరి 17న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాకేంద్రాల్లో విశ్వగురు బసవన్న చిత్రపట అవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

కౌల్ బజార్ సీఐగా ధర్మాకర్



బళ్లారిరూరల్, ఫిబ్రవరి 15: బళ్లారి కౌల్‌బజార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ధర్మాకర్ ఎస్ ధర్మట్టి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన బెళగావి జిల్లా సౌదత్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించేవారు. ఎన్నికల సందర్భంగా ఆయనను అధికారులు కౌల్‌బజార్‌కు బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుభాష్ చంద్రను రాయచూరు జిల్లా దేవదుర్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

పగటివేళ లారీల రాకపోకలు బంద్



నగరంలోనుంచి వెళుతున్న లారీలు

కంప్లి, ఫిబ్రవరి 15 : కుడితిని పట్టణం నుంచి ఏసీసీ, జిందాల్ ఫ్యాక్టరీలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రవాణాను బంద్ చేపట్టాలని పట్టణ పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో రెండు కర్మాగారాల యాజమాన్యాలకు పట్టణం పక్కన బైపాస్ ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఇలా ఉదయం పూట కర్మాగారాలకు లారీలు వెళ్లినట్లయితే పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. ఇకపైన పట్టణంలో ఉదయం వేళల్లో లారీలు తిరగకుండా సిబ్బందిని నియమించాలని పోలీసు శాఖకు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

ఏడుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు



పసుపునీళ్లతో ప్రత్యేక పూజలందుకుంటున్న నాగప్ప

కంప్లి, ఫిబ్రవరి 15: మాఘమాసం సందర్భంగా బుక్కసాగర తుంగభద్ర నది ఒడ్డున అడవుల్లో వెలసిన ఏడుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం పురోహితులు విశ్వనాథ్ స్వామివారికి జలాభిషేకం, అమృతాభిషేకంతో పాటు పసుపు నీళ్లతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులు స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు.

గొప్ప సంఘసంస్కర్త సంత్ సేవాలాల్

జయంతి వేడుకల్లో బళ్లారి మేయర్ శ్వేత



బళ్లారిలో మాట్లాడుతున్న మేయర్ శ్వేత



కురుగోడు తహసీల్దార్ కార్యాలయంలో..



హొసపేటలో నివాళులర్పిస్తున్న అనురాధ



సిరుగుప్పలో మాట్లాడుతున్న తహసీల్దార్

తమ సానుకూల ఆలోచనతో ప్రజలకు అవగాహన కల్పించిన వ్యక్తి సేవాలాల్ అని, మహానగర పాలిక మేయర్ శ్వేత అన్నారు. బళ్లారి స్టేడియం రోడ్డులోని వాల్మీకి భవన్‌లో గురువారం జిల్లాపరిపాలన , జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, దావణగేరి జిల్లా న్యామతి తాలూకా సూరగొండనకొప్పలో భీమనాయక్,ధర్మిణి మాతే దంపతులకు 1739లో జన్మించిన సేవాలాల్ సూరగొండనకొప్పలో ఎన్నో అద్భుతాలు చేశారని చెప్పారు. సేవాలాల్ తన తత్వశాస్త్రం ద్వారా ప్రజల్లోని అజ్ఞానాన్ని పోగొట్టడానికి గోసంరక్షకుడిగా తన జీవితానుభవాన్ని ఉపయోగించారన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ అక్షర జ్ఞానం పొంది లోకానికి వెలుగుగా నిలవాలన్నారు. ఆయన తన సిద్ధాంతాల ద్వారా ప్రపంచానికి జ్ఞాన మార్గాన్ని చూపించాడన్నారు. జిల్లా వైద్యశాల డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గురునాథ్, బి.చవాన్ మాట్లాడుతూ సేవాలాల్ సత్యం అహింస, దయలను అనుసరించి మతాలకు అతీతంగా ఉంటారన్నారు. అంతకు ముందు నగరంలో శోభ యాత్ర అత్యంత వైభవంగా సాగింది. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి శోభయాత్రను మహానగర పాలిక మేయర్ శ్వేత తదితరులు ప్రారంభించారు. కంప్లి, కురుగోడు పట్టణాల్లో సంత్ సేవాలాల్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంప్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో సేవాలాల్ భావ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని నిర్వహించుకున్నారు. అలాగే కురుగోడు పట్టణంలో తహసీల్దార్ రేణుకమ్మ సంత్ సేవాలాల్ జయంతిని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. విజయనగరం జిల్లా హొసపేటలో గురువారం సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విజయనగరం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సన్యాసి సేవాలాల్ 285 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా సహాయక కలెక్టర్ అనురాధ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సిరుగుప్పలో సంత్ సేవాలాల్ తత్వ సిద్ధాంతాలను అందరూ పాటించాలని తహసీల్దార్ షంషాలం పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో గురువారం 285 సంత్ సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో సర్ ఎంవీ విద్యార్థుల ప్రతిభ



జేఈఈ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన సర్ ఎంవి విద్యార్థులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15: జేఈఈ మెయిన్స్ తొలివిడత పరీక్షల్లో సర్‌ఎంవి కళాశాలకు చెందిన 20మంది విద్యార్థులు 99శాతానికిపైగా పర్సంటేజీ సాధించి దావణగేర నగరానికి కీర్తి తెచ్చారు. కళాశాల విద్యార్థులు వినయ.డి.బి, దావణగేర నగరంలో 99.94 శాతం సాధించి మొదటి స్థానంలో నిలిచారు. క్రొత్రేశ్ శివమూర్తి 99.51 శాతం సాధించి దావణగేర నగరానికి ద్వితీయ స్థానం, హెచ్.సంజయ్ 99.41 శాతం సాధించి మూడవ స్థానంలో నిలిచారు. కళాశాల సాధించిన మరో గొప్ప విజయం ఏమిటంటే భౌతిక శాస్త్రంలో అంశిక జి.ఏ. , మహ్మద్ సోహెల్ సెంట్ పర్సంటేజీ సాధించారు. కెమిస్ట్రీలో శ్రీమతి సాగరిక, వినయ, కూడా వందశాతం మార్కులు సాధించారు. గణితంలో కూడా 99.94 శాతం మార్కులు సాధించడం అసమానమైన విజయమన్నారు. ఈసంవత్సరం సర్‌ఎంవి కళాశాలలోని 70మందికి పైగా విద్యార్థులు ఐఐటీలు, ఐఐఐటీలు వంటి జాతీయ స్థాయి ఇనిస్టిట్యూట్‌లలో చేరే అవకాశం ఉంది. ఇప్పటి వరకు కళాశాలకు వచ్చిన ఫలితాల అన్నిటికంటే ఇదే అధికమన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈసందర్భంగా కళాశాల కార్యదర్శి ఎస్.జే.శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకుల కృషి అభినందనీయమన్నారు. దావణగేర నగరానికి చెందిన విద్యార్థులు సాధించిన ఈ ఘనత అపూర్వమని, ప్రతిభ కనబరిచిన విద్యార్థుల భవిష్యత్తు చదువుల కోసం సంస్థ నగదు బహుమతులు అందిస్తుందన్నారు. ఈసందర్భంగా కళాశాల వ్యవస్థాపక మిత్రులు సయ్యద్ షంషీర్, సురేశ్‌కుమార్, పద్మనాభ, ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

అల్లం సుమంగళమ్మ కాలేజీకి ర్యాంకుల పంట



కావ్య



విద్యా



తస్లీమ్‌బాను



సునీత



రేణుక



కీర్తన



రుచిత



సంధ్య



మేఘన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 15 : అక్కమహాదేవి మహిళా విశ్వవిద్యాలయం పరిధిలోని అల్లం సుమంగళమ్మ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి ర్యాంకులను సాధించారని కళాశాల ప్రధాన చార్యురాలు కాళమ్మ తెలిపారు. నవంబర్‌లో నిర్వహించిన తృతీయసంవత్సర పరీక్షల్లో అన్ని బి.ఏ. బిసీఏ, బిఎస్సీ, బిబిఏ విభాగాల్లో 13ర్యాంకులను సాధించారని తెలిపారు. బీసీఏలో కావ్య, బిబిఏలో సునీత ప్రథమ ర్యాంకులు సాధించారు. విద్య బిసీఏ, తస్లీమ్ బాను బిఎస్సీలో ద్వితీయర్యాంకులు సాధించారు. రేణుక బిబిఏ తృతీయర్యాంకు ,పారాయణం కీర్తన బిఎస్సీ, రుచిత బిసిఏ లో నాలుగవ ర్యాంకు, సంధ్య బిసీఏలో 5ర్యాంకు, షబాన బిఏలో 7వ ర్యాంకు, మేఘన బీసీఏ, సుధా బీఎస్సీలో 8వర్యాంకు సాధించి కళాశాలకు కీర్తి తెచ్చారని తెలిపారు. ఇంతటి ప్రతిభకు కనబరిచన విద్యార్థులను వివీసంఘం అధ్యక్షుడు రామనగౌడ ,ఉపాధ్యాక్షుడు చెన్నప్ప, కార్యదర్శి గురుసిద్ధ స్వామి, శాంతనగౌడ, రాజశేఖర్‌గౌడ, కళాశాల పాలక మండలి చైర్మన్ కప్పగల్లు గిరిజ తదితరులు అభినందించారు.

దిష్టిబొమ్మల్లా ఆర్వో ప్లాంట్లు

- కుడితినిలో మూలన పడేసిన వైనం
- తాగునీటి కోసం జనం ఇబ్బందులు
- మరమ్మతులు పట్టని అధికారులు



19వ వార్డులో నిరుపయోగంగా వున్న ఆర్వో ప్లాంటు

కంప్లి, ఫిబ్రవరి 15: వేసవి అంటేనే దాహం. అలాంటి వేసవికాలంలో కుడితిని పట్టణంలో పరిశుద్ధ నీటిని అందించే ఆర్వో ప్లాంట్లు దిష్టిబొమ్మలుగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 30వ తేదీన జనస్పందన కార్యక్రమంలో కుడితిని హిత రక్షణ సమితి అధ్యక్షుడు కామేష్ ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేసి, మంచినీరు జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. అయినా ఇంతవరకు వాటికి మరమ్మతులు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 19వ వార్డు, సంగన బావి తదితర ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడంలేదని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి కుడితిని పట్టణంలో దిష్టిబొమ్మలుగా నిలిచిన ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేసి ఆయా గ్రామాలకు పరిశుద్ధమైన నీరు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చలో బెంగళూరు పోస్టర్ల విడుదల

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 15 : ఫిబ్రవరి 27న ప్రభుత్వ ఉద్యోగుల వేతన పెంపు కోసం చలో బెంగళూరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిరుగుప్ప తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లింగరాజరెడ్డి తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం చలో బెంగళూరుకు ఏర్పాట్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లింగరాజ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ పద్ధతిని జారీ చేయడంలో నిర్లక్ష్య ధోరణి వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 7వ వేతన నివేదిక జారీ కావాలని, ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగులకు ఆరోగ్య రక్ష ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా వున్న ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి హనుమంతప్ప, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర, గౌరవాధ్యక్షులు యేసన్న, కోశాధికారి ఇంజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

విచిత్ర లేగదూడ జననం

బళ్ళారి, గాంధీనగర్, ఫిబ్రవరి 15: కురుగోడు పరిధిలోని వద్దటిలో ఓ ఆవు విచిత్రమైన లేగదూడకు జన్మనిచ్చింది. చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు తండోప తండాలుగా వచ్చి తిలకిస్తున్నారు. వద్దటి గ్రామానికి చెందిన బసప్ప అనే రైతుకు చెందిన ఆవుకు పుట్టిన ఈ లేగదూడకు రెండు తలలు, ఆరు కాళ్లు ఉన్నాయి. దీనికి భూమిపై జీవించే అవకాశం లేకుండా పోయింది. జన్మించిన కొన్ని గంటల్లోగానే ప్రాణాలు వదిలింది. స్థలానికి చేరుకున్న పశువైద్యులు పరిశీలన జరిపారు. తల్లి ఆవులో కొన్ని జన్మపరమైన లోపాల కారణంగా తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుంటాయన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 15: బళ్లారి నగరంలోని కౌల్ బజార్, బ్రూస్‌పేట్ తదితర ప్రాంతాలలోని ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇరువురిని బ్రూస్ పేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న మనోజ్ కుమార్, సంతోష్‌ల నుంచి రూ. 3.05 లక్షల బంగారు ఆభరణాలు, 120 గ్రాముల వెండి, రూ. 5500ల నగదు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బ్రూస్‌పేట ప్రాంతంలో నాలుగు ఇళ్లలో తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు తెలిపారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిటీ డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, సీఐ సింధూర్, క్రైస్ ఎస్ఐ సవితారాణి, పోలీసు సిబ్బంది వన్నూరప్ప, మహబూబ్, ఉమేష్ రెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

హోసూరు జోన్

విద్యాగణపతి ఆలయంలో పూజలు



విద్యార్థులకు పేనాలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ చెన్నీరప్ప

హోసూరు ఫిబ్రవరి 15: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని వికాశ్ నగర్ ప్రాంతంలో పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు విజయం సాధించాలని కోరుతూ శ్రీ విద్యా గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోసూరు తళి రోడ్డులోని శ్రీ విద్యాగణపతి ఆలయంలో విద్యార్థులు ప్లస్‌టూ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించాలని, కోరుతూ హోమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ దేవాలయంలో పబ్లిక్ పరీక్ష రాసే ముందు విద్యార్థులందరిని ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అదే విధంగా ఈ ఏడాది కూడా ప్రత్యేక పూజలు, యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చెన్నీరప్ప పాల్గొని, పరీక్ష రాసేందుకు 100 మంది విద్యార్థులకు పేనాలు, పుస్తకాలు, వారికి కావలసిన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. విద్యార్థులతోపాటు తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

హోసూరు(సిఫ్‌కాట్) ఫిబ్రవరి 15 వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ హోసూరు బాగలూరు , బేరిక్కై, శూలగిరి, డెంకణీకోట ,తళి ప్రాంతాలలో నివశించే వాల్మీకులు కోరుతున్నారు. వారు ఈ మేరకు ఎంపీ తంబిదురైకి గురువారం వినతిపత్రం సమర్పించారు. అవసరమైన రాయితీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ తంబిదురైని కోరారు. తదనంతరం, జిల్లా వాల్మీకి కులస్తుల అసోసియేషన్ అడ్మినిస్ట్రేటర్ చిన్న కుట్టపడాల, నిర్వాహకులు అప్పయ్యన్, తోప్పయ్య, నారాయణస్వామి, చిన్న అబ్బయ్య, నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంల్లో జిల్లా వాల్మీకి కులస్తుల సంఘం నాయకులు కృష్ణప్ప, రామచంద్ర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో సౌకర్యాలలేమిపై బీజేపీ నిరసన

హోసూరు ఫిబ్రవరి 15 : హోసూరులో బీజేపీ తరఫున రాంనగర్‌లో నిరసన నిర్వహించారు. హోసూరు ప్రాంతాలో నీరు, రోడ్ల సౌకర్యం లేకపోవడం వంటి ఫిర్యాదులను పేర్కొంటూ మున్సిపల్ అధ్యక్షుడు మణికంటన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నరసింహన్, బీజేపి జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ పాల్గొని కార్పొరేషన్ పాలనను ఖండించారు. రాష్ట్ర నిర్వాహకులు సుధా నాగరాజ్, రామలింగం, కరుణానిధి, జిల్లా పాలనాధికారులు రాంమూర్తి, రాజశేఖర్, వరలక్ష్మి, టీమ్ కుమార్, శాంతి, వినాయకం తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ పాలనను ఖండిస్తున్న బీజేపీ కార్యకర్తలు

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం: డీసీ



వీధుల్లో సాగుతున్న రోడ్డు భద్రత మాసోత్సవ జాతా

రాయచూరు, ఫిబ్రవరి 15: రోడ్డు నిబంధనలను విధిగా పాటిస్తేనే ప్రమాదాలను నియంత్రించగలమని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం నగరంలోని ఎస్పీ కార్యాలయం వద్ద అవగాహన జాతాను ఎస్పీ బి.నిఖిల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ నిఖిల్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో రాష్ట్రంలో రాయచూరు జిల్లానే అగ్రగామిగా ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం రోడ్డు ప్రమాదాలను నివారించగలిగామని ఎస్పీ వివరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేవారు అన్ని రకాల రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను మరింత తగ్గించగలమన్నారు. రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు మితిమీరిన వేగానికి దూరంగా ఉండాలన్నారు. అదే సమయంలో మైనర్‌లకు వాహనాలు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు వారి యోగక్షేమం గురించి ఆలోచించాలన్నారు.

మొసళ్ల పార్కు ఏర్పాటుకు ఎమ్మెల్యే వినతి

రాయచూరు, ఫిబ్రవరి 15 : కృష్ణనది తీర ప్రాంతంగా ఉన్న రాయచూరు రూరల్ నియోజక వర్గం పరిధిలో మొసళ్ల పార్కు ఏర్పాటు చేయాలని రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ కోరారు. గురువారం శాసనసభలో ప్రసంగించిన రాయచూరురూరల్ ఎమ్మెల్యే, దద్దల బసనగౌడ, తెలంగాణలోని జూరాల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల తమ తాలూకాలోని మూడు దీవి గ్రామాల ప్రజలకు తీవ్ర సమస్య ఉన్నట్లు తెలిపారు. కృష్ణనది నడిగడ్డలో మూడు గ్రామాలతోపాటు రెండు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన దత్తపీఠం, చన్నబసవేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయని ఈ ఆలయాలను వేలాది మంది భక్తులు సందర్శిస్తారన్నారు. మొసళ్ల పార్కు ఏర్పాటు చేయడంవల్ల పర్యాటక కేంద్రంగా కూడా నడిగడ్డ ప్రాంతం అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వానికి విన్నవించారు.

సీఎం వ్యాఖ్యలతో పరిషత్‌లో వాగ్వాదం

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్.. నిరసనగా బీజేపీ, జేడీఎస్ వాకౌట్..

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ప్రతిపక్ష సభ్యుడి పట్ల ముఖ్యమంత్రి సిద్దరామయ్య అనుచిత వ్యాఖ్యలు చేశారని, వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలనే అంశంపై తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. గురువారం ప్రశ్నోత్తరాల వేళ కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే గ్రాంట్ల విషయమై ముఖ్యమంత్రి సిద్దరామయ్య వివరణ ఇస్తున్న వేళ సభ్యుడు రుద్రగౌడ అభ్యంతరం తెలిపారు. ఇదే సందర్భంలోనే ప్రతిపక్ష సభ్యులు గుండాలు, ఛీతూ అంటూ సంబోధించారని, వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జేడీఎస్ సభ్యుడు శరవణ మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యుల పట్ల హేళనగా సీఎం మాట్లాడటం సరికాదన్నారు. ప్రశ్నోత్తరాల వేళ ఒక ప్రశ్నకు నాలుగు నిమిషాలు మాత్రమే సమాధానం చెప్పాలనే నిబంధన ఉన్నా సీఎం ఉపన్యాసాలు ఇవ్వడం ఎంతవరకూ సమంజసమన్నారు. బీజేపీ నేత కోటా శ్రీనివాసపూజారి మాట్లాడుతూ సీఎం లాంటి సీనియర్‌నేత, అనుభవం ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం సరికాదన్నారు. సీఎం ఎంతసేపు మాట్లాడినా అభ్యంతరం లేదని అయితే తోటి సభ్యులను హేళన చేసేలా మాట్లాడటం సరికాదన్నారు. ఇరుపార్టీ సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో సభను కాసేపు వాయిదా వేశారు. తర్వాత 1.15 గంటలకు సభ ఆరంభం కాగానే అసభ్య పదాలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. ఇదే సందర్భంలో బీజేపీ సభ్యుడు రవికుమార్ జోక్యం చేసుకుని ఇలా తిట్టడం రికార్డుల నుంచి తొలగించే విధానమంటే బాగుండదన్నారు.


సీఎం సహా మంత్రులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ సభ్యులు

సీఎం వివరణ ఇస్తూ తాను మాట్లాడుతున్న వేళ సభ్యుడు రుద్రేగౌడ అడ్డు తగిలారని కూర్చో అనడం తప్ప మరేమి దూషించలేదన్నారు. సీఎం వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రతిపక్ష సభ్యులు సభాపతి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి మార్పులేక పోవడంతో బీజేపీ, జేడీఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.


ఏప్రిల్ 1 నుంచి రేషన్ కార్డుల పంపిణీ

రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి రేషన్ కార్డుల పంపిణీ జరగనుంది. ఈ విషయాన్ని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప శాసనసభలో గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యే నయనా మోటమ్మ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ మార్చి 31 నాటికి రేషన్ కార్డుకోసం దాఖలయ్యే దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. అంతకుముందు సభ్యురాలు నయనా మోటమ్మ మాట్లాడుతూ బీపీఎల్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. బీపీఎల్ కార్డులు ఆధార్, బ్యాంక్ అకౌంట్లతో అనుసంధానం కావడం లేదని ప్రజలు తన దృష్టికి తెచ్చారన్నారు. చాలా మంది అర్హులకు కొన్ని నెలలుగా 5 కిలోల బియ్యం లభించలేదన్నారు. చర్చలో జోక్యం చేసుకున్న ప్రతిపక్షనేత ఆర్.అశోక్ బీపీఎల్ కార్డుల పంపిణీని పూర్తిగా నిలిపేశారని, సర్వర్ డౌన్ అంటూ వంకలు చెబుతున్నారని విమర్శించారు. గత 8 నెలల వ్యవధిలో రాష్ట్రంలో ఎన్ని బీపీఎల్ కార్డులు పంపిణీ చేశారో చెప్పాలని నిలదీశారు. బీపీఎల్ కార్డులు లేకపోవడంతో నిరుపేదలకు ఉచిత ఆరోగ్య చికిత్సా సేవలు కూడా లభించలేదన్నారు. సభలో పలువురు సభ్యులు బీపీఎల్ కార్డుల పంపిణీని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై మంత్రి మునియప్ప స్పందిస్తూ గత ప్రభుత్వం 2.95 లక్షల రేషన్ కార్డులను పంపిణీ చేయకుండా పెండింగ్‌లో ఉంచిన సంగతిని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం వచ్చాక 57వేల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసిందన్నారు. ఆరోగ్య చికిత్సల కోసం దాఖలైన బీపీఎల్ కార్డులను తక్షణం జారీ చేయాల్సిందిగా అధికారులకు సూచించామన్నారు. ఇలాంటి అత్యవసర కేసులకు సంబంధించి ఇంతవరకు 744 బీపీఎల్ కార్డులు జారీ చేశామన్నారు. ప్రస్తుతం బీపీఎల్ కార్డులున్న వారికి సాంకేతిక కారణాలతో 5 కిలోల బియ్యం అందించలేని చోట నగదు రూపంలో చెల్లించేందుకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రతిపక్షనేత చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి సభకు తెలిపారు. గ్యారెంటీలకు, రేషన్ కార్డులకు సంబంధం లేదని స్పష్టంచేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

దాదాసాహెబ్ ఫాల్కే (వర్ధంతి)



భారతీయ సినిమా పితామహగా పేరొందిన దాదాసాహెబ్ ఫాల్కే 1870 ఏప్రిల్ 30న మహారాష్ట్ర సమీపాన త్రయంబకేశ్వర్‌లో జన్మించారు. అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. కళాత్మక అభిరుచి కారణంగా జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనం నేర్చుకున్నారు. బరోడాలోని కళాభవన్‌లో ఫొటోగ్రఫీ, మౌల్డింగ్, ఆర్కిటెక్చర్ వంటి అనేక కళలతోపాటు మ్యాజిక్ కూడా నేర్చుకున్నారు. లఘు చిత్ర నిర్మాత నుంచి దర్శకుడిగా, నిర్మాతగా ఎదిగారు. ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి 1913లో 'రాజా హరిశ్చంద్ర' సినిమాను రూపొందించారు. ఆ తర్వాత 19 ఏళ్లలో 95 ఫీచర్ ఫిల్మ్‌లు, 27 షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించారు. మోహినీ భస్మాసుర, సావిత్రి సత్యవాన్, లంకా దహన్, శ్రీకృష్ణ జన్మ, కాళీయ మర్దన్ తదితర సినిమాలు ఎంతో గుర్తింపు పొందాయి. సినిమా రంగంలో ఆయన అందించిన అద్వితీయమైన సేవలకుగాను కేంద్రప్రభుత్వం ఆయన గౌరవార్థం 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు' ఇస్తోంది. 1944 ఫిబ్రవరి 16న కన్నుమూశారు. 1971లో ఆయన పేరిట ఒక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు.

నార్ల వెంకటేశ్వరరావు (వర్ధంతి)



వీఆర్ నార్లగా సుపరిచితులైన నార్ల వెంకటేశ్వరరావు 1908 డిసెంబరు 1న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జన్మించారు. తెలుగునాట ప్రముఖ పాత్రికేయుడు, రచయిత. ఆంధ్రజ్యోతి పత్రికకు చాలాకాలం సంపాదకులుగా పనిచేశారు. పత్రికా రచనలేకాక పలు నాటకాలు, కవితలు, కొన్ని కథలు రాశారు. జర్నలిజానికి ఎనలేని సేవలందించిన ఆయన హేతువాదిగా, మానవతావాదిగా జీవించారు. ఎడిటర్‌గా పనిచేసిన 37ఏళ్ల కాలంలో మూఢ నమ్మకాలపై రాజీలేనిపోరు సాగించారు. ఆయన రచనలు అన్నీ కూర్చి ఇటీవలే 'నార్ల రచనలు' పేరిట పలుభాగాలుగా వెలువరించారు. 1985 ఫిబ్రవరి 16న కన్నుమూశారు.

రాజధానిలో 279 అనధికార లేఅవుట్లు

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో 279 అనధికార లేఅవుట్లు ఉన్నాయని బెంగళూరు అభివృద్ధి ప్రాధికార గుర్తించినా ఈ దిశలో ఇంకా ఎలాంటి కార్యాచరణ ప్రారంభించలేదు. మాస్టర్ ప్లాన్ ప్రకారం లాండ్ కన్వర్షెషన్, లేఅవుట్ల ఏర్పాటు జరగడం లేదని బీడీఏ అధికారులు గతంలోనే గుర్తించారు. ఇలా గుర్తించిన లేఅవుట్లలో 27వేలపైగా ఇళ్ల స్థలాలు ఉన్నాయి. ఈ లేఅవుట్లు నియమ నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు అంటున్నారు. బెంగళూరు ఈస్ట్ తాలుకాలోని బిదరహళ్ళి, కెఆర్ పురం, వర్తూరు సమీపంలోని గ్రామాల్లోనూ యలహంక తాలుకాలోని యలంహక, జాల శివారు ప్రాంతాల్లోని గ్రామాల్లోనూ అనేకల్ తాలుకాలోని జిగణి, సర్జాపుర శివారు గ్రామాల్లోనూ, దక్షిణ తాలుకాలోని ఉత్తరహళ్ళి, కింగేరి, బేగూరు శివారులోని గ్రామాల్లోనూ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా లేఅవుట్లు తెలెత్తాయని అధికారులు అంటున్నారు. ఈ అవుట్లలో ఇళ్ల స్థలాలను లక్షలాది రూపాయలకు ప్రజలకు విక్రయిస్తున్నారని తెలిపారు. రాజకీయ వత్తిళ్ళ కారణంగానే అక్రమలేఅవుట్ల విషయంలో ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని అంటున్నారు.

శాసనసభా కార్యకలాపాలు వీక్షించిన పౌరకార్మికులు

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పౌరకార్మికులు, హిజ్రాలకు సభాకార్యకలాపాలు వీక్షించేందుకు అవకాశం కల్పించినందుకు స్పీకర్ యూటీ ఖాదర్‌ను మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రత్యేకంగా అభినందించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతున్న వేళ ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. శాసనసభకు వీరిని ఆహ్వానించి సముచిత గౌరవం అందించడం సంతోషంగా ఉందన్నారు. పౌరకార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు. తాను సీఎంగా ఉన్న సమయంలో 11వేల మంది పౌరకార్మికులను రెగ్యులరైజ్ చేశానన్నారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తికావాలన్నారు. ఇంకా 43 వేల మంది పౌరకార్మికులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు దక్కేలా చూడాల్సి ఉంటుందన్నారు. ఈ సభకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోలేకపోయే అణగారిన వర్గాల ప్రజల బాణీగా ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. పౌరకార్మికులను కేవలం సభాకార్యకలాపాలు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తే సరిపోదన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

● రూ.10లక్షల ఆస్తి నష్టం

నల్లచెరువు, ఫిబ్రవరి 15: మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామంలో చాకలి రెడ్డెప్ప నివాస గృహం గురువారం ఉదయం వంట గ్యాస్ సిలిండర్ పేలి కూలిపోయింది. కాగా ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై బాధితుడు రెడ్డెప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ కుమార్తె వివాహం అన్నమయ్య జిల్లా ములకలచెరువులో ఉండడంతో అందరం బుధవారం రాత్రి వెళ్లామన్నారు. అయితే గురువారం ఉదయం 6గంటల సమయంలో ఇంటిలో వంట గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలిందన్నారు. విషయం తెలియగానే తాము 7గంటలకు వచ్చి చూడగా.. నూతనంగా నిర్మించుకున్న ఇల్లు కూలిపోయిందన్నారు. ఇంటి లోపలి భాగం గోడలు పూర్తిగా పడిపోయాయని, బయటి భాగం గోడలు నెర్రెలు చీలాయని అన్నారు. నివాసం ఉండేందుకు ఆ ఇల్లు పనికిరాదన్నారు. ఘటనతో దాదాపు రూ.10లక్షల నష్టం జరిగిందన్నారు. కుమార్తె వివాహానికి వెళ్లడంతో అందరం ప్రాణాలు దక్కించుకున్నామన్నారు. విషయంపై నల్లచెరువు పోలీస్‌స్టేషన్‌లోనూ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఏపీఓ బదిలీ

రొద్దం, ఫిబ్రవరి 15 : మండల ఉపాధిహామీ ఏపీఓ రషీద్ కదిరి నియోజకవర్గం తలుపుల మండలానికి బదిలీ అయ్యారు. రొద్దం మండలంలో ఉపాధిహామీ పనులు నత్తనడకన సాగుతుండగా జిల్లాలోనే రొద్దం మండలం అట్టడుగున ఉన్నట్లు సమాచారం. జిల్లాస్థాయి అధికారులు సైతం రొద్దం మండల అధికారులపై ఉపాధిహామీ పనులు వేగంగా పెంచాలని మందలించారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తిస్థాయిలో లేకపోవడం, ఉన్నవారికి కూడా జీతాలు సరిగా అందడం లేదన్న విమర్శలున్నాయి.

బ్రాండ్ల రూపకల్పనతోనే భవిష్యత్తు

పీఈఎస్ సదస్సులో ప్రొ చాన్స్‌లర్ జవహర్‌దొరస్వామి

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ రంగంలో బ్రాండ్ల రూపకల్పన కీలకంగా మారిన సమాజంలో ఉన్నామని, ప్రస్తుతం విశ్వమంతా క్షణాల్లో తెలుసుకునే సాంకేతిక విధానాలు ఉన్నాయని పీఈఎస్ యూనివర్శిటీ ప్రొ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్‌దొరస్వామి అభిప్రాయపడ్డారు. 'బ్రాండ్ సమ్మిట్-2024 భవిష్యత్ లీడర్ల రూపకల్పన' అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరిగింది. మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగం డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఐటీసీ సంస్థ ఇతివృత్తాన్ని ఆమె సోదాహరణంగా వివరించారు. జవహర్ దొరస్వామి మాట్లాడుతూ పీఈఎస్ యూనివర్శిటీ దేశంలోనే అత్యుత్తమ బ్రాండ్‌గా రాణిస్తోందన్నారు. అందుకు దశాబ్దాల కాలంగా గుణాత్మకతను పాటించడంతో పాటు నైతిక విలువలు నిరంతరంగా క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగాలు సాధ్యం చేయడమే కారణని తెలిపారు. పీఈఎస్ గోల్డన్ జూబ్లీ జరుపుకుంటోందని, ఇదే తరుణంలోనే విశ్వవ్యాప్తంగా పీఈఎస్ విద్యార్థులు వివిధ హోదాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. పీఈఎస్ బ్రాండ్ వెనుక ఎంతో శ్రమ ఉందని, అందుకు అనుగుణంగానే దేశమంతటా ప్రాచుర్యం పొందిందన్నారు. ఐటీసీ ఫుడ్స్ విభాగం సీఈఓ వీఎల్ రాజేష్ మాట్లాడుతూ బ్రాండ్ బిల్డ్ చేయడమనేది నిత్యం సాహసమైన చర్యవంటిదే అన్నారు. ఐటీసీ దేశవిదేశాలలో రాణించేందుకు నిబద్ధత, నమ్మకమే కారణమని తెలిపారు. ది బ్రాండ్ జిమ్‌లో ఆసియా మేనేజింగ్ పార్టనర్ ప్రసాద్‌నరసింహన్ తన అనుభవాలను పంచుకున్నారు. టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ నేపథ్యంపై ట్రాన్స్‌ఫోర్మేషన్ అండ్ ఎలక్ట్రానిక్ బిజినెస్ గ్రూపు డైరెక్టర్ పవన్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థుల అభిప్రాయాలతో పాటు సందేహాలను నివృత్తి చేశారు.



బ్రాండ్ సమ్మిట్‌లో పీఈఎస్ ప్రొచాన్స్‌లర్ జవహర్ తదితరులు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి సత్కారం

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరినీ పులకింపజేసిందని తెలుగు విజ్ఞాన సమితి పేర్కొంది. సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎ.రాధాకృష్ణరాజు సారథ్యంలో పదాధికారులు బెంగళూరు రాజ్‌భవన్‌లో గురువారం వెంకయ్యనాయుడిని ఘనంగా సత్కరించారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. గత ఐదు దశాబ్దాలుగా తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళల వికాసానికి తన వంతు సహకారం అందిస్తూ మాతృభూమి, మాతృభాష పరిరక్షణ కోసం ఎంతగానో పరితపిస్తున్నారని ప్రశంసలు గుప్పించారు. కర్ణాటక రాష్ట్రంలో తెలుగు-కన్నడ భాషల ప్రజలు వెంకయ్యనాయుడికి సదా రుణపడి ఉన్నారన్నారు. బెంగళూరులో శ్రీకృష్ణదేవరాయల కళామందిరం ఆధునికీకరణకు ఎంతగానో చేయూతనందించారని కొనియాడారు. సత్కరించిన పదాధికారుల బృందంలో సమితి ఉపాధ్యక్షులు కె.గంగరాజు, ఆర్. ఆదికేశవులునాయుడు, కోశాధికారి సీపీ వరదరాజు, కార్యవర్గ సభ్యులు జి.రమణబాబు తదితరులున్నారు. తెలుగు భాషా వికాసాలకు తాను సదా ముందుంటానని ఈ బృందానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు.


వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న సమితి పదాధికారులు

'క్యాన్సర్ లక్షణాలను ప్రారంభదశలోనే గుర్తిస్తే ఉత్తమ ఫలితాలు'

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతియేటా 50వేల మంది చిన్నారులు క్యాన్సర్ సంబంధిత వ్యాధులతో అలమటిస్తున్నారని నగరంలో జరిగిన వైద్యనిపుణుల సదస్సు పేర్కొంది. బెంగళూరులోని సంప్రద ఆసుపత్రిలో బుధవారం జరిగిన సదస్సును ఉద్దేశించి ఆసుపత్రి పీడియాట్రిక్స్ అంకాజీ, హెమటాలజీ కన్సల్టెంట్ డాక్టర్ ఇంతెయూర్ మెహ్ది మాట్లాడుతూ చిన్నారుల్లో క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించడం సాధ్యమేనన్నారు. క్యాన్సర్‌కు జెనిటిక్ కారణాలతో పాటు పలు రకాల వైరస్‌లు, ఆహార శైలి కూడా ఒక ప్రముఖ కారణంగా ఉంటోందన్నారు. దేశంలో ప్రతి మిలియన్ మంది చిన్నారుల్లో గరిష్టంగా 124 మంది క్యాన్సర్ సమస్యలతో అలమటిస్తున్నారన్నారు. గతరెండు మూడు దశాబ్దాలుగా దేశంలో కేన్సర్ కేసులు పెరుగుతుండటం ప్రత్యేకించి చిన్నారులు త్వరగా వీటి బారిన పడుతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. బాల్యంలో సోకే క్యాన్సర్‌ను గుర్తించడం చాలా కష్టమని ఇందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారుల్లో లుకేమియా, లింఫోమా, మెదడులో గడ్డలు, బోన్ ట్యూమర్, ఐ ట్యూమర్, టిష్యూ ట్యూమర్, లివర్ ట్యూమర్ వంటి కేన్సర్ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయన్నారు.



సదస్సు వేదికపై వైద్యనిపుణులు

క్రైస్తవులపై నిందలు.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలపై ఎఫ్ఐఆర్

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులను నిందించారన్న ఆరోపణలపై దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు డి.వేదవ్యాస కామత్, డాక్టర్ వై.భరత్ శెట్టిపై మంగళూరు సౌత్ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. స్థానిక వెలెన్సియా సెయింట్ జెరోసా పాఠశాల వద్ద సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో జై శ్రీరామ్ నినాదాలతో పాటు క్రైస్తవ మతాన్ని కించపరిచేలా ప్రసంగించి శాంతి సామరస్యాలకు భంగం వాటిల్లేలా వ్యవహరించారని వీరిపై అభియోగాలు మోపారు. అనిల్ జెరాల్డ్ లోబో చేసిన ఫిర్యాదు మేరకు ఈ ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు విశ్వ హిందూ పరిషత్ నేత శరణ్ పంప్‌వెల్, కార్పోరేటర్లు సందీప్ గరోడి, భరత్‌కుమార్‌లపై కూడా ఎఫ్ఐఆర్ దాఖలైంది.

47 సంవత్సరాలైనా వసూలు కాని అప్పు

- కాగ్ నివేదిక వెల్లడి

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తన అధీనంలోని పలు శాఖలు, సంస్థలకు ఇచ్చిన రూ.10,389.78 కోట్ల రుణం దశాబ్దాలు కావస్తున్నా ఇంకా వసూలు కాలేదు. ఆశ్చర్యం రేకెత్తించే ఈ అంశాలు కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్)- 2022-23 వార్షిక నివేదికలో వెలుగు చూశాయి. శాసనసభకు సమర్పించిన కాగ్ నివేదిక ప్రకారం 8 శాఖల నిర్వహణలోని 21 సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిల అవతారమెత్తాయి. వీటిలో బెంగళూరు జల మండలి ఏకంగా రూ. 12,144 కోట్లు, కర్ణాటక సీడ్స్ కార్పొరేషన్ రూ. 1.44 కోట్లు, కర్ణాటక పర్యాటక అభివృద్ధి సంస్థ రూ.5.24 కోట్లు ప్రభుత్వానికి దీర్ఘకాలంగా బకాయిపడ్డాయి. రుణాలు మంజూరు చేసిన సమయంలోనే ప్రభుత్వం వీటిని తిరిగి చెల్లించే విషయమై పలు నిబంధనలు రూపొందించినా ఇవి ఏమాత్రం అమలు కావడం లేదని, రుణాల వసూలుకు గట్టి యత్నాలు జరగడమేలేదని కాగ్ వ్యాఖ్యానించింది. వడ్డీ కూడా కలిపితే ప్రభుత్వానికి రావాల్సిన బకాయి ఏకంగా రూ. 15,856 కోట్లకు చేరుకుంటుందని కాగ్ వెల్లడించింది. కాగా అధికారుల ఖాతాల్లో (పర్సనల్ డిపాజిట్లు)కి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 32,201.44 కోట్లు జమ కాగా ఇందులో రూ. 29,509 కోట్లు నిర్దేశిత పనులు, సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చుకాలేదని కాగ్ పేర్కొంది.

26 నుంచి రాష్ట్రస్థాయి ఉద్యోగమేళా

- 500 కంపెనీల భాగస్వామ్యం

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి రెండురోజుల పాటు రాష్ట్ర స్థాయి ఉద్యోగమేళా నిర్వహించదలచారు. నిరుద్యోగ యువతీయువకుల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భారీస్థాయిలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో మేళా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లపై సీఎం సిద్ధరామయ్య సమీక్ష జరిపినట్లు ప్రకటించారు. భారీ పరిశ్రమలు, విద్యాశాఖ, యువసబలీకరణ, నైపుణ్యాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, వైద్యఆరోగ్యశాఖలు సంయుక్తంగా ప్రత్యేక కమిటీను ఏర్పాటు చేసి వారి మార్గదర్శకంలోనే మేళా జరుపున్నట్లు ప్రకటించారు. మేళాలో 500 కంపెనీలు భాగస్వామ్యం అవుతుండగా వేలాది మంది నిరుద్యోగులు పాల్గొంటారని భావించి ప్యాలెస్ మైదానంలో కా ర్యక్రమం జరుపదలచినట్లు వెల్లడించారు. 26 నుంచి రెండురోజుల పాటు మే ళా జరగనుందన్నారు.

ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీలలో పవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని ఇండియా ఫర్ ఇండియా ఫౌండేషన్ సలహాదారు భరత్ భూషన్ తెలిపారు. నగరంలో ఈ కార్యక్రమ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. కామన్ యూనివర్శిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ), కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (సీఎల్ఏటీ), నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ), రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఆర్ఐఈసీఈఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్ఐడీడీఏటీ) వంటి ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9177098007 నంబరులో సంప్రదించాలని వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

మాలాశ్రీ ప్రధాన పాత్రలో నైట్ కర్ఫ్యూ

కన్నడ చిత్రజ్యోతి

బెంగళూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాక్షన్ క్వీన్ మాలాశ్రీ చాలా గ్యాప్ తర్వాత నైట్ కర్ఫ్యూలో ప్రధాన పాత్రను పోషించారు. ఇదొక వైవిధ్యభరితమైన సాహస పాత్ర అని చిత్రదర్శకుడు రవీంద్రవెంశి గురువారం వెల్లడించారు. కొవిడ్ సందర్భంలో జరిగిన యదార్థ ఘటనల ఆధారంగా అత్యంత ఆసక్తికరమైన రీతిలో కుతూహలం రేకెత్తించేలా చిత్రకథను తానే అందించానని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాను వీక్షించిన సెన్సార్‌బోర్డు యూఏ సర్టిఫికెట్ ప్రదానం చేసిందన్నారు. గతంలో పుటాణి సఫారి వంటి హిట్ చిత్రాన్ని అందించిన బెంగళూరు నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త బిఎస్.చంద్రశేఖర్ ఈ సినిమాను నిర్మించారు. ఇందులో శక్తిగా మాలాశ్రీ, యుక్తిగా రంజని రాఘవన్ నటించారని, వీరితో పాటు ప్రమోద్ శెట్టి, రంగాయణ రఘు, సాధుకోకిల, సహనశ్రీ, అశ్విన్ రమేష్, వర్ధన్ తీర్థహళ్ళి, మంజుపావగడ, మండ్య సిద్దు, సదానంద గంగరాజు, నితిన్, సి.వసంతకుమార్, బేబి మౌల్య మంజునాథ్, జ్యోతి, రజని, శివరాజ్ శెట్టి, ఎం.మహేష్, అల్సూరు రాజకుమార్‌లు ప్రముఖ పాత్రలను పోషించారన్నారు. చిత్రానికి నేపథ్య సంగీతాన్ని ఎంఎస్ మారుతి సమకూర్చారు. బెంగళూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో చిత్రీకరణపూర్తి చేసుకున్న ఈ చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో సిద్ధమైందని ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు ప్రకటించారు.


విభిన్న పాత్రలో నటి మాలాశ్రీ

కృష్ణా నీ బేగనే బారో ప్రారంభం

చందనసీమలో 80వ వడిలో సాహససింహ విష్ణువర్ధన్ నటించిన కృష్ణా నీ బేగనే బారో చిత్రం అందరికీ గుర్తుండాలి. అప్పట్లో ఈ సినిమా సూపర్ హిట్ అయింది. భిన్నమైన కథాంశంతో మళ్ళీ కృష్ణా నీ బేగనే బారో చందనసీమలో పాదార్పణం చేసింది. దుబైకు చెందిన ఎస్.నీలకంఠ, చలపతి రాజు సంయుక్తంగా నీలకంఠ ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా టాలివుడ్‌కు చెందిన జి.సూర్యతేజ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ముహూర్త కార్యక్రమం నగరంలోని బలమురి వరసిద్ధి వినాయక దేవస్థానంలో ఘనంగా జరిగింది. నటులు అనీశ్ తేజేశ్వర్, ఇశాన్ తొలిసన్నివేశానికి క్లాప్ కొట్టగా నిర్మాత సోదరుడైన హైదరాబాదుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనిబాబు ఫుల్లేట్ కెమెరా స్విచాన్ చేశారు. కథకు అనుగుణంగా ఈ టైటిల్‌ను ఖరారు చేశామని సినిమాలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుందని దర్శకుడు గురువారం మీడియాకు చెప్పారు. సహజంగా కృష్ణుడికి గోపికలు ఉంటారు. ఈ సినిమాలో హీరోకుమాత్రం ఎలాంటి గోపికలు ఉండరు. నాటకీయంగా నలుగురు యువతులు ఈ చిత్రంలోని కృష్ణుడితో కనెక్ట్ అవుతారు. ఇది ఎలా జరిగింది? అసలు వీరి మధ్య ఉన్న సంబంధం ఏమిటి అనే ఆసక్తికరమైనకోణంలో హాస్యభరితంగా కథ సాగుతుందన్నారు. బెంగళూరు, గోవా, కేరళలలోని లోకేషన్లలో చిత్రీకరణ జరుపాలని ప్లాన్ చేస్తున్నట్లు దర్శకుడు వెల్లడించారు. ఒక పాటను విదేశాల్లో చిత్రీకరించే ఆలోచన ఉందన్నారు. ఏకకాలంలో కన్నడ, తెలుగు, తమిళ, భోజ్‌పురి భాషల్లో తీస్తున్నామన్నారు. భోజ్‌పురిలో కృష్ణ భక్తులు అధిక సంఖ్యలో ఉన్నందున ఆ భాషలోకి డబ్ చేస్తామన్నారు. ఈ చిత్రంలో బీవీ భార్గవ్ హీరోగా నటిస్తుండగా ముంబైకు చెందిన ఊర్వశి పరదేశి, చైత్రా, ప్రియాంక, ఆశురెడ్డి హీరోయిన్లుగా నటిస్తున్నారన్నారు. మిగిలిన తారాగణంలో తారా, అచ్యుతకుమార్, అజయ్ రత్నం, తదితరులున్నారని దర్శకుడు తెలిపారు. నాలుగు పాటలు ఉంటాయన్నారు.


క్లాప్ కొడుతున్న నటులు అనీశ్ తేజేశ్వర్, ఇశాన్